
గవర్నమెంటు ఎన్ని శాసనాలు చేసినా, మనిషినీ, దాన్ని శాసించే మనసునీ, దాని అలవాట్లనూ మార్చలేదు. నలుగురితోపాటు బ్రతకనేర్వని వాళ్ళను బ్రతకనేర్చినవాళ్ళెవరూ రక్షించాలనుకోరు. అందుకే మంచికి శిక్ష పడుతూనూ ఉంది, చెడు బ్రతికి బట్టకడుతూనూ ఉంది.



# బ్రతకనేర్చినవాళ్ళు

శింగనపల్లి బలరామ్

మధురంగా వినవస్తోంది సంగీతం.

మనోజ్ఞంగా ఉంది సాయంకాలం.

మెల్లగా చల్లగా నడుస్తోంది కాలం.

మెల్లగా చల్లగా నడుస్తున్నాడు సాంబశివరావు.

ఇసుకలో అడుగులు త్వరగా పడుతున్నాయికావు.

నెలాఖరైనా, నిండుకోవలిసిన జేబు నిండుకూ డబ్బుంది అతగాడికి.

అన్నీ నోట్లే! అయినా బరువుగానే ఉన్నాయి.

జేబు ఎంత బరువుగా ఉంటే మనసంత తేలిగ్గా ఉంటుంది.

ఇది, విలోమానుపాతం.

కాని — ఈసారి అలా కాలేదు.

జేబు బరువుగా ఉన్నట్టే మనసుకూడా బరువుగానే ఉంది.

ఇది, అనులోమానుపాతం.

ఆ విలోమం అనులోమంగా మారటానికి కారణమేమిటా అన్నదే అనుమానం.

అయిదు నిమిషాల క్రిందవరకూ అతను విలోమంలోనే బ్రతికేవాడు.

జేబు తేలికా, మనసు బరువూను.

అయిదు నిమిషాల్లో అంతా తారుమారయింది.

డబ్బుతో ఎంతవారయినా మారుతారన్నది నిజం.

జబ్బులా ఎంతదానికయినా కారణాలు వెదకడం మానవనైజం.

కారణం కావాలంటే కంచికి వెళ్లిన కథను వెనకనుంచీ నడుపుకురావటం, శుభం.

సాంబశివరావుగారు ఇప్పుడు; సాంబుగాడు ( లేదా సాంబడు ) ఒకప్పుడు.

డబ్బుంది *గదా* ఇప్పుడు! — అది లే దప్పుడు.

చెప్పుకోవాలంటే, ఆయన బడిపంతులు. తప్పనుకుంటే, హైస్కూల్ టీచరు.

చాలా మంచివాడు. దుండగీడుకాడు. కీడు చెయ్యలేడు. కుడిచెయ్యివాడు.

సాంబం బాగా కలిగిన కుటుంబంలో పుట్టలేదుగానీ, బొత్తిగా లేనికుటుంబంలో కూడా పుట్టలేదు.

కలిగినా పిల్లలు కలిగినందున ఆస్తి కరిగిన ఇల్లు.

ఓమాదిరి తరగతి. మామూలు పరపతి.

అందుకే అతన్ని బి.ఇడి. వరకూ చదివించగలిగారు, వాళ్ల పెదనాన్నగారు.

ఎందుకంటే, అతని చిన్నప్పుడే పోయారు వాళ్ల

నాన్నగారు, పాపం!

పాపం! అతనూ శ్రద్ధగా చదువుకున్నాడు.

బుద్ధిమంతుడన్న గొప్పపేరూ తెచ్చుకున్నాడు.

అమాయకుణ్ణి బుద్ధిమంతుడనీ, గడుసువాణ్ణి అల్లరిపిండమనీ అనుకోవడం లోకం రివాజు.

బయటి కని తీరటం ఒక మోజు.

సాంబు ఇంకా బుద్ధిమంతుడు. ఎందుకంటే—

అతని కెలాంటి వ్యసనాలూ లేవు.

సిగరెట్, బీడీలంటే డోకు.

విస్కీ, బ్రాందీలంటే వాసన.

టీ, కాఫీలంటేనే తలనొప్పి.

ముఖ్యమైంది: ఆడవాళ్ళంటేనే భయం. బిడియానికి ఆడవాళ్ళే అతనికన్నా నయం. ఇవన్నీ కలిసి అతడికి పదుగురిలో మంచివాడనే పేరూ, పరీక్షల్లో మంచి మంచి మార్కులూ సంపాదించి పెట్టాయి. ఆ మార్కులు ఉద్యోగాన్ని సంపాదించిపెడితే, ఆ ఉద్యోగం సంపాదనంటూ మొదలుపెట్టింది. అది సంసారానికి దారితీసింది.

లక్షణంగా పెళ్ళి పెళ్ళి చేసేసుకున్నాడు.

లక్షలు పుచ్చుకోనూలేదు. లవ్ ఇచ్చుకోనూలేదు.

మంచిగా బ్రతకాలనీ, వంచన తప్పనీ అతని ఉద్దేశం. తప్పులు చేయకూడదని మనసులోని ఆశయం. అప్పట్లో అలాగే అంటుండేవాడు. అలాగే ఉండేవాడు.

స్కూల్లో, క్లాసులో, తన సబ్జక్టులో విషయాల కోసం ఎక్కడెక్కడి గ్రంథారణ్యాలూ తిరిగి (తిరగేసి) పలువిధాలైన శక్తివంతమైన మూలికలూ సేకరించి, ఆలోచనల కల్వంలో నూరి, ఆరోగ్యవంతమై, తేలిగ్గా అరిగే మెత్తని మందు తయారుచేసి, నోట్సు ఉగ్గు గిన్నెలో పోసి, మారాంచేసే కుర్రవాళ్ళ నోటిలో పోసి, బ్రతిమాలి బలవంతంగా గుటకవేయించటంలో అతనిలాంటి మేస్టరు మరి లేడు! అతనంత చక్కగా, చిక్కగా చెప్పేవాడూ లేడు.

అయినా, అందరూ అతన్ని చేతకానివాడంటారు.

ఎందుకంటారో కనుక్కోవడం అతని చేత కాలేదు.

మళ్ళీ, ఏ పనీ చెయ్యలేననడు. ఎంద రెన్ని అన్నా కిమ్మనడు.

హెడ్మాస్టరుకి అతనంటే అందుకే మమకారం.

అసువైనవాళ్లను చూస్తే అందరికీ పుట్టే వికారం అదే.

ఆ అభిమానంకొద్దీ ప్రతిరోజూ మరిచిపోకుండా ఆఫీసుకు పిలిచి పరామర్శిస్తుంటాడు హెడ్మాస్టరు. కిట్టనివాళ్ళేమో తిడుతున్నాడంటారు. సాంబం పడుతున్నాడంటారు.

స్టూడెంట్లకు, ఇలా తమకోసం ఇంత శ్రమపడే కొరడాదెబ్బలన్నిటికీ ఓర్చి, బంజర్లను సాగుచేసే ఎద్దులాంటి టీచరంటే చాలా చాలా జాలి.

ఆ జాలికొద్దీ వాళ్ళు బిరుదిచ్చారు "పి. సి." అని.

పి. సి. ఎబ్రీవియేషన్ ఏ డిక్షనరీలోనూ ఉండదు.

స్టూడెంట్ సైకాలజీకి అడ్డుగోడలు అసలు ఉండవు.

పి. సి. ని ఉన్నదున్నట్టుగా తెనుగుచేస్తే "పా. చి." అనిట.

"పా. చి." అన్నదికూడా తిరిగి ఎబ్రీవియేషనే. అంటే "పాత చింతపండూ!" అని అర్థంట.

ఆయన — సాంబం కాస్త కృష్ణవిగ్రహంలా ఉండటమే అందుకు కారణం.

అయినా, పాపం, అతనేం అనుకోలేదు, వాళ్ల సరదా ఎందుకు కాదనాలి అని.

ఊరుకుంటే ఉసిత తానూ గుద్దు పెడతా నంటుంది.

ఊరుకున్నామని చైనా, పాకిస్తాన్‌లు మనపై కళ్ళురిమినట్టుంది.

వీరవిద్యార్థులు ఓసారి బ్లాక్‌బోర్డుపై గుమ్మడి కాయలంత అక్షరాలతో "పాత చింతపండూ, సాంబ శివం" అని ఎంతో పొందిగ్గా రాసి ఉంచారు.

అంతేనా, ముందర "శ్రీశ్రీశ్రీ" అని ఎంతో గౌరవాన్నికూడా చేర్చారు.

ఆయన వచ్చి బోర్డువైపు తిరగ్గానే ఏకగ్రీవులై గొల్లున నవ్వారు.

కొంచెంసేపు రెప్పవేయకుండా చూసి, చిన్ననవ్వుతో మాస్టారు కళ్ళు తుడుచుకుని ఇలా అన్నారు:

"వెల్! మిస్టర్స్. ఇవాళ చాలా సుదినం.

నేను చేసిన మేలంటూ ఏదీ లేకపోయినా, నాకోసం ఇంత శ్రమ తీసుకుని, ఈనాటి (పొలిటికల్) పార్టీ నాయకుని అనుయాయుల్లా బ్రహ్మాండమైన పబ్లిసిటీ చేస్తున్నందుకు సంతోషం.

కానయితే, నాదో చిన్న సూచన.

ఇలా గవర్నమెంట్ బోర్డులూ, పబ్లిక్ రోడ్లూ ఖరాబుచేయటమనేది చెడ్డ యోచన. టీ బ్రేవ్! మీకంత సరదాగా ఉంటే, శుభ్రంగా ఏనుగుల్లాంటి అక్షరాల్లో ఓ బ్రహ్మాండమైన సైన్‌బోర్డు పెయింట్‌చేసి నాలుగురోడ్ల సెంటర్లో నిలప రాదుటయ్యా! నే కాదంటానుటయ్యా! ఏం? నవ్వటం ఆపేశారేం!"

ఆయ నంత అడిగితే కాదనకూడదనుకుని మరింతగా నవ్వేశారు వాళ్ళు.

ఆ తరవాత సిగ్గుపడి కాదుగానీ విసుగుపడి పిలవడం మానేశారు ఎదటపడినవాళ్ళే!

ఇప్పటికీ ఆ స్కూల్లో "చింతపండు" అంటే అదిగో అంటారుగానీ, సాంబశివరావుగారంటే తెలియు దంటూ రెవళ్ళూ!

పిల్లలతో కాదుగానీ, జీతంరాళ్లతో అతని జీవనం దుర్భరమౌతూంది.

ఆ చాలీచాలని రాళ్లదెబ్బలతో అతని తల బొప్పి కడుతూంది.

పెళ్ళి అయి కొద్దిరోజులే అయినా, పెళ్ళాంకో ముద్దు ముచ్చటలే తీర్చలేకపోయాడు.

పిల్లల్ని కన్నాక తీర్చు మన్నాడు వాళ్లమీద.

కాని వాళ్ల పాలకోసం మళ్ళీ ఇబ్బందులు పెరిగాయి. తల్లికి పాలు లేకపోయినా ఆవుకు పాలుంటాయి. కానీ ఆలిని కట్టుకున్నట్టుగా ఆవును కట్టుకోలేం, డబ్బివ్వందే!

తప్పనిసరిఅయి అప్పులు మొదలయ్యాయి. చప్పుచప్పున చక్రవడ్డీల్తో పరుగులు పెడుతున్నాయి. వాటిచేత నడివీథిలో ఈడ్వబడుతున్న సాంబానికి నరనరమూ తోడుకుపోతూంది. నెలజీతం నెలవడ్డీలు కట్టేందుకే చాలకుండాఉంది.

కర్కోటకుడంటారు గానీ పాపయ్య చాలా కరుణా మయుడు.

కాకపోతే "సాంబం మేస్టు"కి డబ్బెలా ఇస్తాడు? వడ్డీ రూపాయకు నెలకూ పావలామాత్రమే.



**ఉదయపూర్ పిచోలా సరస్సు**

**ఫోటో—ప్రభాకర్ మహాధిక్ (బొంబాయి—28)**

తోటివాళ్లైన రామ్మూర్తి మేస్టరూ, అప్పయ్య మేస్టరూ తనకన్న గ్రేడు తక్కువైకూడా ఎలా సంపాదిస్తున్నారో సాంబాని కర్థంకాలేదు.

వాళ్లకే లోటూ లేదు. రామ్మూర్తి స్వంతంగా పొలాలు కొంటే, అప్పయ్య స్వయంగా ఇల్లు కట్టిం చాడు. ఇందులో చిదంబర రహస్యం వేరే లేదు. స్పష్టంగా కనిపిస్తున్నదే. వాళ్ళు ప్రైవేట్లు చెప్పడం ఒకటి, పేపర్లు దిద్దటం రెండు.

ఈ రెండూ సాంబం చెయ్యలేడా అంటే గండుకానీ సాంబశివం ప్రైవేటు మాటంటేనే శివమెక్కు తాడు. అలాగని కమ్యూనిస్టు అనలేం.

క్లాసులో మనస్ఫూర్తిగా చెబితే ఇంక ప్రైవేటుల్లో వేరేగా చెప్పేందుకంటూ ఏమీ ఉండదు. కనకనే "సిన్సియర్ టీచరు ప్రైవేట్లు చెప్పలేడు; చెప్పరాదు" అని అతని పార్టీ సిద్ధాంతం.

ఇది తనకే వర్తించేది.

పేపర్లు దిద్దుకోవడంతప్ప జీవితపు పేపర్లు దిద్దుతా నని అత డనుకోడు. అందుకే స్కూల్లో అశాంతి!— మనిషిలో అసంతృప్తి! మనసులో విరక్తి!

ఇంట్లో భార్య పోరు వాటికిలోడు.

ఆమె సీతా, సావిత్రీ కాదుగానీ సూర్యకాంతం కావచ్చు.

ఆమెకీ ఈమెకీ బంధుత్వంలాంటి దేమీ లేదు. కానీ ఆమె వెండితెరపై ఎలా కనిపించవలిసివస్తున్నదో ఈమె జీవితపు తెరపై అలా కనిపించవలిసివస్తున్నది.

ఇందులో ఆమె తప్పేం లేదు.

ఓ నాలుగు ప్రైవేట్లు చెప్పుకుంటే కొంపేం మునిగిపోతుంది (పై పెచ్చు ఉద్ధరింపబడుతుంది) అన్న ఆమె వాదానికి సాంబశివం ఒప్పుకోలేదు.

ప్రైవేట్లు చెప్పించుకునేవాళ్ల ఉద్దేశంలో ప్రయివేటు అంటే "పాసు చేయించే పూచీ" అని తెలు సతనికి.

ఈ లాలూచీతో కూడిన పూచీ ఇష్టం లే దతనికి.

అర్థంకాని పాఠాలు మళ్లీ మళ్లీ చెప్పడాని కెప్పుడూ సిద్ధమనేవాడు.

ఎందరో ప్రైవేట్లు చెప్పమని వస్తే తీరదనేశాడు.

అలా అనడంవల్ల తన బ్రతుకే తీరడంలేదు.

చిక్కులన్నిటితో అతని మనసు అహర్నిశమూ బాధలకు గురిఅయింది.

పోనీ, తెలియదనుకుందామంటే కళ్ళు తెరుచుకునే




ఇంటిల్లపాదికీ

**అజంతా**

టూత్‌బ్రష్‌లు.

పెద్దలనుంచి, పిల్లల వరకూ ప్రతి ఒక్కరి కోసం ప్రత్యేకంగా ఒక టూత్‌బ్రష్. ప్రత్యేకంగా ఎంచిన నైలాన్ బ్రిసల్స్ నుంచి కుంచెలు తయారు చేసారు. మీ పండ్లను చక్కగా పరిశుభ్రం చేసేలాగు, ముఖ్యంగా టార్‌టార్ జమకూడే సందులను చేరేలా ఈ కుంచెలు తయారుచేసారు.

పరిశుభ్రత కోసం-పారిశుధ్యానికి ఈ బ్రషులను ప్లాస్టిక్ పెట్టెలలో పేక్ చేసారు.

ఇంకా దొరికేవి:
అజంతా షేవింగ్ బ్రష్, అజంతా హెయిర్ బ్రష్
మరియు 25 మరియు లాంగ్ హేడ్, హార్డ్, మీడియం, సాఫ్టు రకాలలో.

హేండలు మరియు కంటైనర్ డిజైనులు రిజిస్టరు చేయబడినవి.

దీ బోంబే బ్రష్ కం. ప్రయివేట్ లి.
బొంబాయి-34.

RATAN BATRA /BB/TEL/09A

ఉంటాడాయె.

ఆ వెధవది ఆఫీసులో గుమస్తా, ముష్టి బంట్రోతు గాదూ, ఎలా బ్రతుకుతున్నారో చూస్తూనే ఉన్నాడు.

ఆనాడు —

సాంబశివం మాప్సను గూర్చి ఆఫీసుకి వచ్చాడు.

"అప్పారావుగారూ! నా టి. సి. ఇంకా ఇవ్వలేదండి! హెడ్మాస్టరు ఇష్యూఆర్డరు వేసి మూడు రోజులైనా?" అంటూంది అక్కడే తచ్చాడుతున్న ఓ అబ్బాయి గొంతు, కాటికి పోయినా ఖర్చు తప్పదన్నట్టు పోతానన్నా టి. సి. రాక.

"ఇంకా నా దగ్గిరికి రాలేదండీ! మళ్లీ రండి" అంటూ పాతపాటే పాడాడు అప్పారావు.

"ఎలాగండీ? చాలా అవసరం! ఏదో మీరు కొంచెం..." పోనుపోనూ శ్రుతి తగ్గిస్తూ నీళ్లుగారా డబ్బాయి. విజయగర్వంతో నవ్వి, కొత్తపాట మొదలు పెట్టాడు గుమస్తా. శ్రుతికూడా తగ్గట్టు మార్చాడు.

"మరేం లేదూ. ఎవళ్ల కడుపుమంట వాళ్లది చూడండీ — ఆ ప్యూను పాపం, పిల్లలున్నవాడూ! (పాపం పిల్లలదా — ప్యూనుదా?) ఏదో సంతోషం కొద్దీ ఒకటో రెండో పారేస్తే, పాపం, తెస్తాడిక్కడికి. నా అభ్యంతరమేం లే" దన్నాడు బంట్రోతుపై ప్రేమ ఒలకబోస్తూ.

ముఖం మాడ్చుకుంటూ, సంతోషమంటూ, ఆ ముడుపు చెల్లిస్తే, వాడది తెస్తూ, మళ్లీ సరోపకారిలా వంగి మరీ "చూడండీ!! ఏదో మీారని చెబుతున్నాను. ఆ క్లర్కుగారు చాలా కష్టపడతారు, పాపం! మీరేదో ఐదో పదో సంతోషపెట్టాలి. ఇదే ఆఖరు గదా? మినిట్లో మీ పని సరి" అనిసకిలించాడు.

అదలా జరిగిపోతూంది.

మాప్ లేకుండా సాంబం వచ్చేశాడు.

పెదవి కొరికాడు కోపం వచ్చి. పెదవి తెగడం తప్ప లాభం లేకపోయింది.

అంతకన్నా ఇంకేం చేస్తాడు?

విచారంగా విచారిస్తూ అందులో తలమునకలౌతాడు.

క్లాసులో ఎకనమిక్సు నోట్సు డిక్టేట్ చేస్తూ "ద్రవ్యోల్బణము" అనగా అని నిర్వచనం మొదలుపెట్టి అలా ఆలోచనల్లో పడి మాట్లాడకుండా ఉండిపోతాడు. చిక్కుల్లో చిక్కుకున్న సాంబశివం ఐదునిమిషాలయాక తెప్పరిల్లి "చనిపోయింది" అంటూ ఇంకేదో పూర్తి చేస్తాడు.

స్టూడెంట్సు బుద్ధినంతా చూపెట్టి రాసేసుకుంటారు.

ఎప్పుడేనా చూసుకుని నవ్వుకుంటుంటారు.

అతని ఏ షర్టుకూ గుండీలు ఉండవు, అంత పాతవవి.

అతని ఏ చెప్పుకూ కన్నాల్లేకుండా ఉండవు, అంత మంచివవి.

అతని కేరోజూ ఉత్సాహంగా ఉండదు, అంత జీవిత మది.

ఈ కారణాలన్నిటివల్లా అతని బిరుదావళిలో క్రొత్త మార్పు చేరింది.

ఎబ్రీవియేషనదే. కాని, ఈసారి "పి. సి." అంటే "ప్రొఫెసరిన్ క్రేకాలజీ" అని.

సాంబశివం నవ్వేస్తాడది విని.

జాగ్రత్తగా చూస్తే ప్రతీదీ మనకి పాఠం

చెబుతుంది. పాఠాలేం చెబుతాయి!

సాంబశివం సినిమాలకు వెళ్లడం మానుకున్నాడు.

డబ్బుల్లేక అంటే ఎంత చిన్నతనం? ఇష్టం లేకనే!

ఇష్టంలే దెందుకంటే — ముందు నెళ్లిన కొద్ది సార్లూకూడా అన్నీ అసందర్భాలే చూశా డందులో. అందులో భార్యాభర్తలు ప్రేమించుకుని ముద్దు పెట్టుకుంటారు. కొరకొరా చూసుకుని కరుచుకోరు.

కొంతమంది పిల్లలు నీటుగా దీటుగా ఉంటారు. హద్దులేని పిల్లలు చీమిడిముక్కూ చింపిరితలతో ఉండరు.

భర్త కొట్టినా తిట్టినా భార్య సహించడం ఉంటుంది.

భార్య ఈశ్శినా మూల్గినా భర్త సేవించడం ఉండదు.

వాళ్లు పాడుకుంటూంటారు. పోట్లాడు కుంటూండరు.

అంతా అందంగా ఉంటారు. ఒక్కరూ వికారంగా ఉండరు.

అన్నిటికన్నా ముఖ్యం, మేడలూ, డబ్బులూ, నవ్వులూ, లవ్వులూ ఎక్కువ.

సుడిసెలూ, దరిద్రాలూ, ఏడ్పులూ, మార్పులూ తక్కువ.

దాసీదైనా మూడుగంటల్లో ముప్ఫైమూడు చీరలు విప్పుతుంది.

సాంబానికి అమాంతం తెర చింపేయాలన్నంత కోపం వస్తుంది.

అదేం జరగదుకానీ, చివాల్న లేచి, ఒకరిద్దరి కాళ్లు మాత్రం తగిలి, కళ్లు నెత్తినుండి దించుకుని బయటికి వచ్చేస్తాడు.

అతనికి కార్లూ, హోటళ్లూ అన్నాకూడా కావలిసినంత అసహ్యం. ఎవరేనా హోటలుకు పిలిస్తే గుర్రుమంటాడు.

జాలి దలిచి ఏమనడిగితే ఖర్మ అంటాడు.

నిజమే! "ప్చ్! అదృష్టం కలిసిరాలేదు" అందామంటే అదీ వీల్లేదు.

వెదుక్కుంటూ వచ్చిం దోనాడు వైకుంఠం రూపంలో.

వచ్చి, వినయంగా నమస్కరించి, కుశలప్రశ్నలు వేసి మరీ లౌక్యంగా విషయాన్ని కదిపింది.

"ఆ! మాస్టారూ! ఫిఫ్త్‌ఫారం పేపర్లేవో మీరు దిద్దుతున్నారట. మావా డొకడు బ్రిలియంటేగానీ కాస్త ఇందులోనే దొటంయున్నాడు. మీతో మాట వేద్దామని ఇలా వచ్చాను.కొంచెమీ నెంబరు చూస్తే..." అంటూ చీటీక్రింద పచ్చనోట్లు పేర్చుకుని మరీ వచ్చింది.

సిరి రా మోకా లడ్డు పెట్టాడు మాస్టారు.

"మీ రిలాంటివారు కాదని నాకు తెలీదూ! మళ్లీ మూడోకంటివాడికి తెలియడమే?" అని అక్కడికీ ధైర్యం చెప్పింది అదృష్టం.

నీతీ గీతీ అంటూ చెప్పేటక్కపోయి, సాంబం సీరియస్‌గా "డబ్బుతో మనుషుల్ని కొనలేరు, మిస్టర్ వైకుంఠం!" అని అనబోయి, ధైర్యం చాలక మనసులోనే అనేసి, "బయటికి వెళ్లం"డని లేచాడు.

"ఆలోచించు, పంతులూ! నీలుగెందుకూ? — నువ్వుగాకపోతే నీ తాతచేత జరిపిస్తాను" అని కోపంతో బుసలు కొడుతూ సర్రున లేచి వెళ్లిపోయింది అదృష్టం, తాతను వరించడానికి.

మర్నాడు హెడ్మాస్టారు పిలిచి, నయానా భయానా చెప్పినా వినుకోలే దతడు.

అదృష్టానికి కోపం వచ్చిందంటే రాదూ?

అన్నంత పనీ జరిగిపోయింది. ఆ కుర్రాడు దివ్యంగా పాసయ్యాడు.

సాంబానికి మిగిలింది పెద్దలతో ఓ ఇంత విరోధం. కాగా అప్పటికప్పుడు ఆ కుర్రాడిచేత మరిన్ని ప్రశ్నలు దగ్గిరుండి ఆన్సరుచేయించి, దాన్ని నేర్పుగా పాత పేపర్లలో ఇరికించి, చెయ్యవలిసిన మార్పులూ చేర్పులూ చేసి పరధ్యానపు సాంబశివంగారి ప్రయోజకత్వ మిదంటూ మీదికి వ్రాసి మెమో తెప్పించిన, రెడ్‌మార్కు పెట్టించిన హెడ్మాస్టరు సంగతి ఆ మెమో చూశాకగానీ తెలియలేదు సాంబానికి.

అందరూ నవ్వుతుంటే అన్యాయమని కుళ్లి ఏడ్చా డతను లోపల్లోపలే, బయటికి ఏడిస్తే ఎవరేమంటారోనని.

అప్పటినించీ రోజూ ఏదో ఓ మెమోనే అతగాడికి.

ఎందుకో ఓ అందుకు ఏడుపే అతనికి.

ఇంట్లో గిన్నెలూ, ముంతలూ దెబ్బలాట.

ఒంట్లో మనిషికీ మనసుకూ దెబ్బలాట.

మధ్య నలిగేది సాంబం.

వాటికితోడు — అప్పులవాళ్ల పీకులాట. పనివాళ్లతో కీచులాట. బ్రతుకుతో ఎంతకాల మీ వేగులాట?

బ్రతకడం నేర్చుకోలేక చచ్చిపోదా మనుకున్నాడు.

అదీ చాతకాలేదు.

సముద్రంలో పడిపోతుంటే పట్టుకున్నారు.

నీళ్లు కక్కించారు. తెలివి తెప్పించారు. గొల్లుమనిపించారు. రికార్డుకి ఎక్కించారు. కోర్టు కెక్కించారు. కేసు పెట్టించారు. చుట్టూ తిప్పించారు.

వెరసి, డబ్బు కక్కించారు. మరింత అప్పు చేయించారు.

ఈ స్థితిలో చావలేక బ్రతకలేక ఏమీ చెయ్యలేక సాంబం ఉన్న పరిస్థితుల్లో అవసరమున్నవాళ్లకు అదును చిక్కింది. కన్నుకుట్టినవాళ్లకు మందు దొరికింది.

గబగబా అడగని ఆర్తత్రాణ పరాయణత ఊపిరిసలపనంతగా అతనిమీద ఒంపారు.

నలుగురూ చేరి ఇది పనిగాదని గడ్డి పెట్టారు.

"బ్రతకడ మిలారా, యెర్రెదవా" అని నేర్పి పెట్టారు.

"భయపడకు! భయపడితే అన్నీ తప్పులే! లేకపోతే ఏదీ లేదు. ముందుకురావాలంటే ఇలా లాభంలేదు. ఏదో 'పరోపకారార్థ మిదం శరీరం' గనక వాళ్లిచ్చిం దేదో పుచ్చుకుని, నీ చేతయిం దేదో చెయ్యి! ఒప్పుకన్నా మంచిది అదే అవుతుంది. బ్రతుకంటే అదీ. లౌక్యమే లోకం! ( లేదంటే పనికి రాదు)!" — ఇలాగ, ఎకనమిక్సు మాస్టారికి ఎకనమిక్సులో వెలలేని పాఠాలు బోధించబడ్డాయి.

నీట్లో నానుతున్న మన్ను, నలుపక్కలా వేడి తగులుతున్న వెన్న కరగ కేం చేస్తుంది?

బ్రతకలేక చద్దామని, అలా చావలేక బ్రతికిన సాంబం గతిలేక నలుగురు పెట్టిన గడ్డి తిన్నాడు. చెప్పినదంతా విన్నాడు.

వాళ్లూ వీళ్లూ, బ్రతుకూ పెట్టిన బలవంతంతో బ్రతకటానికి పూనుకొన్నాడు.

ఒకటీ, రెండూ, మూడూ . . పదీ! . . . ప్రైవేట్లు పెరిగాయి. పరిస్థితులు మెరుగయ్యాయి. డబ్బూ, పలుకుబడీ, బాధ్యతా — అన్నీ హెచ్చాయి. దాంతోబాటు గుండెల్లో బరువుకూడా పెరిగింది. కాని కష్టం తగ్గింది.

ప్రయివేట్లో చదువేం చెప్పక్కర్లేదు. చెబితే వాళ్లకు మళ్లా కోపం.

కోపమ్మైతే రావడం మానేస్తారు.

మానేసినా ఏం అనకూడదు, డబ్బిచ్చేది వాళ్లుగనక.

ఏమంటే పెద్దవాళ్లు సమర్థిస్తారు, మాకే పనుందని.

బజారుపనుల్లాంటివయితే వాళ్లకీ సంతోషం, తనకీ పని లాభం.

క్లాసులో వాళ్లకో ప్రత్యేక స్థానం. ప్రశ్నలు వెయ్యకూడదు. గోల పట్టించుకోగూడదు.

"ఎలా పాసవుతా?" రనకూడదు మరి!

"అందుకేగదటయ్యా నిమ్ము పెట్టింది?" అంటే సరి.

అలా అలా — సాంబం పెరిగి పెద్దవాడై "సాంబశివంగా" రయ్యాడు.

వరసాగ్గా అన్నీ పెరిగాయి. జేబులూ పెరిగాయని వేరే చెప్పనక్కరలేదు. ఆశతోపాటే అవీ.

ఈ నెలలో ఈ సంవత్సరపు స్కూల్ ఫైనల్ పేపర్లు అతనికి వచ్చాయి. ( ఎవరితో అనకండి స్మీ! ఇది సీక్రెట్ )

ఈ సాయంత్రం అప్పుడే ఎడ్వాన్సులు జేబులోకి వచ్చాయి.

> జ్ఞానరహితమైన ప్రతిష్ఠ బలహీనమైనది, నిరుపయోగమైనది.
>
> —జార్ట్ శాంటయాన

ఏదో దూరపు ఊరినుండి ఆసామీ బాగానే పట్టుకు వచ్చాడు. ముట్టజెప్పాడు.

సాంబశివరావు ఎంత పెరిగినా, పాత సాంబం కూడా ఓ మూల నామమాత్రంగానైనా ఉంటాడు.

గుండెల్ని పీకుతూంటాడు.

కాబట్టే, మనసు బరువుగా ఉంటుంది. అది తప్పదు.

గవర్నమెంటు ఎంత జీతాలు పెంచినా, చట్టాలు మార్చినా మనిషినీ, దాన్ని శాసించే మనసునీ, దాని అలవాట్లనూ మార్చలేదు.

ఇంతకుముందు, బ్రతకలేక బడిపంతులు.

ఇకముందు బ్రతకనేర్చిన బడిపంతులు.

అదీ కథ.

తా. క.:

---

కథ ముగించాక గుప్పుమన్న మరో విషయం. సంబంధం ఉంది గనక చెప్పాలి. పాపం! సాంబశివం గారిని పోలీసులు పట్టుకున్నారట, దొంగనోట్లు మార్చబోతుండగా. పాపం! ఆయనే అవి అచ్చు కొట్టించాడంటే ఎవరూ నమ్మరుగానీ అవెక్కడివో ఆయన సంజాయిషీ ఇవ్వలేకపోవడం ఆశ్చర్యం! — శిక్ష తప్పుతుందనే నమ్మకం ఎవరికీ లేదు.

బ్రతకనేర్పినవాళ్లెవరూ రక్షించాలనుకోలేదు. వాళ్లు హాయిగానే ఉన్నారు! అంతే! ★